

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,16 సెప్టెంబర్ 2025

8 పేజీలు


# డిఎల్‌పిఓ కార్యాలయ ఏఓ అవినీతి

# అన్ని నేనే.. అంతా నేనే



## అంటూ బరితెగింపు



కాకినాడ డివిజన్ డిఎల్‌పివో కార్యాలయ ఏవో వెంకటరెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

- పంచాయతీరాజ్ శాఖలోని ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చంగల్ రావు ఫిర్యాదుపై విచారణకు ఆదేశం
- సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ శోభారాణిని విచారణ అధికారిణిగా నియామకం

కాకినాడ జిల్లా పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న పలువురు ఎస్సీ,బీసీ ఉద్యోగులపై ఓముతాగా ఏర్పడి తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ, ఆ ఫిర్యాదులు క్లోజ్ చేయడానికి సదరు ఉద్యోగుల నుంచి కాకినాడ డీఎల్పీఓ కార్యాలయ ఏవో సిహెచ్. వెంకట రెడ్డి వేలల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ పి.చెంగల్‌రావు సోమవారం పీజేఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై డిఆర్వో జే.వెంకట్రావు విచారణకు ఆదేశించారు.

కాకినాడ డివిజన్ డిఎల్‌పిఓ కార్యాలయ ఏవో సిహెచ్ వెంకట్ రెడ్డిపై చేయబడిన ఫిర్యాదుపై వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని విచారణ అధికారిగా సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ శోభారాణిని నియమించారు.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

- మిగతా 2 లో..

ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

# ఎస్‌పి బాలు వల్ల తెలుగు పాటకు ప్రపంచ ఖ్యాతి వచ్చింది

-మంత్రి కందుల దుర్గేష్



**ధవళేశ్వరం,మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ రాకా కల్చరల్ అసోసియేషన్ మరియు గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులఆహ్వానంమేరకు ధవళేశ్వరం జలవనరులశాఖ పర్యవెక్షక ఇంజనీర్ కార్యాలయం సమీపంలో ఇటీవల ఆవిష్కరించిన పద్మవిభూషణ్ శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం విగ్రహం వద్దకు విచ్చేసి నివాళులు అర్పించారు,బాలు విగ్రహానికి పూలమాల వేసితెలుగుపాటకు ప్రపంచఖ్యాతి తీసుకు వచ్చిన మహనీయుడన్నారు, గాయకునిగా, నటునిగా, సంగీత దర్శకునిగా, నిర్మాతగా, డబ్బింగ్ కళాకారునిగా ఏ రంగం లోనైనా అత్యున్నత స్థాయిలో పరిపూర్ణత సాధించిన గొప్ప కళాకారుడని కొనియాడారు, భారత ప్రభుత్వం భారతరత్న తో సత్కరించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు, ఇంకా ఎంతో

- తరువాయి 2లో..

# జెఎన్టీయుకెలో విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం యుసిఇకె సివిల్ ఇంజనీరింగ్ విభాగం డాక్టర్ కెఎల్.రావు సెమినార్ హాలు నందు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.పద్మకుమారి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను ముఖ్యఅతిథిగా ఉపకులపతిప్రొఫెసర్ సిఎస్ఆర్కె .ప్రసాద్ విచ్చేయగా ప్రత్యేక అతిథిగా కాకినాడలోని ఆర్&బిసర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.కంతు, అతిథిగా యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు విచ్చేశారు.ఈసందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ సిఎస్ఆర్కె.ప్రసాద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ అందరికీ ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంజనీరింగ్ ప్రతిభతో అసాధారణ విజయం సాధించినవారిలో భారత జాతి గర్వించదగిన వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, ఇంజనీర్‌గా మన దేశ ఖ్యాతిని నలుదిశలా చాటారన్నారు. ఈ రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి, ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించారని, ఆయన మార్గదర్శకత్వంలో చేపట్టిన నిర్మాణాలు నేటికీ చెక్కుచెదరలేదంటే అతిశయోక్తి

- తరువాయి 2లో..

# సోలార్ విద్యుత్‌తో ప్రయోజనం

- ఎమ్మెల్యే కొండబాబు





**కాకినాడ, మేజర్‌న్యూస్ :** సోలార్ విద్యుత్ ద్వారా వినియోగదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో సోలార్ ప్యానెల్ సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం కింద కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ ద్వారా విద్యుత్ ప్రతి ఇంటికి అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఒకకిలో వాట్ అయితే రూ.30 వేలు, రెండు కిలోవాట్ల విద్యుత్‌కు రూ.50 వేలు మూడో కిలోవాట్ల విద్యుత్తుకు రూ.78వేలు సబ్సిడీ అందిస్తున్నాయని చెప్పారు. దీనితోపాటు రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అయితే రూ.20 వేలు, ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీలను అందిస్తుందని, ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించాలని సూచించారు. ఇళ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడంతో కాలుష్య నివారణ కూడా జరుగుతుందన్నారు. ఒక యూనిట్‌కు రూ.2.90 పైసలు వినియోగదారులకు విద్యుత్ శాఖ చెల్లిస్తుందని

- తరువాయి 2లో..

# డిఎల్‌పిఓ కార్యాలయ ఏఓ అవినీతి అన్ని నేనే.. అంతా నేనే అంటూ బరితెగింపు

**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ పి.చెంగల్ రావు ఆధ్వర్యంలో పలు దళిత గిరిజన సంఘాల నాయకులు కాకినాడ డివిజన్ డిఎల్పిఓ కార్యాలయ ఏవో సిహెచ్.వెంకటరెడ్డి అవినీతి ముఠాగా ఏర్పడి చేస్తున్న అక్రమాల విషయంపై సోమవారం కలెక్టరేట్లో జరిగిన పీజీఆర్ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ తాము కాకినాడ జిల్లా లో పనిచేస్తున్న వివిధ సంఘాలకు బాధ్యత వహిస్తున్న సామాజిక ఉద్యమకారులమని అన్నారు. యు.కొత్తపల్లి మండలం, పొన్నాడ గ్రామ పంచాయతీకి సుమారు 3 నెలల క్రితం సియోన్ కుమార్ అనే యస్.సి. కులానికి చెందిన పంచాయతీ కార్యదర్శిని సాధారణ బదిలీలలో నియమించడం జరిగిందన్నారు. అతను తమకు తెలిసినంతవరకు ఎంతో బాధ్యతగా పంచాయతీశాఖ నిబంధనలకు లోబడి విధులను నిర్వహిస్తున్నాడన్నారు. ప్రజలకు అందుబాటులో వుంటూ పంచాయతీ సేవలను అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పొన్నాడ పంచాయతీకి సంబంధం లేని నాగులాపల్లి, కొండెవరం పంచాయతీలకు చెందిన బిళ్ళకుర్తి రామేశ్వర రెడ్డి, వాసంశెట్టి శ్రీనులు అకారణంగా అసత్య ఆరోపణలతో తరచుగా జిల్లా కలెక్టర్‌కి పిజిఆర్ఎస్ లో సియోన్ కుమార్ ను బదిలీ చెయ్యాలని పిర్యాదులు చేస్తున్నారన్నారు. సదరు విషయమై తాము సియోన్ కుమార్ ను అడుగగా అతను తనకు ఎలాంటి సమాచారము లేదని వారెవరో, ఎందుకు పిర్యాదు చేస్తున్నారో తనకు తెలియదని చెప్పాడన్నారు. ఆ విషయమై కొంచెం లోతుగా సమాచారము సేకరించగా కాకినాడ డివిజన్ డిఎల్పిఓ ఆఫీసులో ప్రస్తుతం ఎ.ఓ.గా విధులు నిర్వహిస్తున్న సి.హెచ్. వెంకటరెడ్డి అనే ఉద్యోగి ఇద్దరిని ప్రోత్సహించి వారితో పిర్యాదులు చెయ్యించాడని తెలిసిందన్నారు. గతంలో కూడా సదరు వెంకటరెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగంపై సామర్లకోట పోలీసు స్టేషన్లో ఎఫ్.ఐ.ఆర్. నెం. 236/2023 నమోదు అయివున్నదని తెలిసిందన్నారు. 12వ ఆర్థిక సంఘం నిధుల తాలూక వడ్డీని అతని సొంత ఖాతాకు మళ్ళించుకున్నాడని కూడా తెలిసిందన్నారు. అంతేకాకుండా అతను సర్వీసులో వుండగా చనిపోయినవారి కుటుంబ సభ్యులకు తిరిగి ఉద్యోగము ఇప్పించే విషయములో, అలాగే బెనిఫిట్స్ ఇచ్చే విషయములో మహిళలను కావాలనే ఉద్దేశపూర్వకముగా తన చుట్టూ త్రిప్పుకుంటూ నచ్చిన వారిపై లైంగిక వేదింపులు కూడా చేస్తుంటాడని తెలియవచ్చిందన్నారు. బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, వాసంశెట్టి శ్రీనివాసులు ఇద్దరు ఏఓ సి.హెచ్. వెంకటరెడ్డి చెప్పిన ప్రకారం ఉద్యోగులపై తరచుగా అలవాటుగా పిర్యాదులు చేస్తున్నారు. ఆ పిర్యాదులను పెద్దగా చూపించి తిరిగి క్లోజ్ చేయడానికి క్లోజ్ చేయడానికి డివిల్ పిఓ కార్యాలయ ఏవో సి.హెచ్.వెంకటరెడ్డి పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తుంటాడన్నారు. ప్రత్యేకించి యస్.సి., బి.సి. ఉద్యోగులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటారన్నారు. సదరు ఇద్దరు పిర్యాదుదారుల ఆధార్ నెంబర్లను పి.జి.ఆర్.యస్.లో ఇప్పటికే బ్లాక్ చేసారని తెలియవచ్చిందన్నారు. యస్.సి., బి.సి. కులాలకు చెందిన చిరుద్యో గులను మానసిక వేదింపులకు గురిచేస్తూ అన్యాయంగా అసత్య ఆరోపణలతో పిర్యాదులు చేయిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న సి.హెచ్. వెంకటరెడ్డి, అతని అనుచరులు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, వాసంశెట్టి శ్రీనివాసు పైన డిపార్టుమెంటల్, పోలీసులతో ఎంక్వయిరీలు జరిపించాలని అలాగే యస్.సి., యస్.టి. పి.ఓ.ఏ చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని పిజిఆర్ఎస్ లో డిఆర్ఓ జే.వెంకటరావుకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. తమ విజ్ఞప్తిపై స్పందించిన ఆయన సోషల్ వెల్ఫేర్ శాఖ జాయింట్ డైరెక్టర్ శోభారాణిని విచారణ అధికారిణిగా నియమించారన్నారు. సదరు వెంకటరెడ్డి ఫోన్ కాల్ హిస్టరీని పరిశీలిస్తే నిజాలు బయటికి వస్తాయన్నారు. సియోను కుమార్ ఒకడినే కాకుండా చాలామంది బీసీ, ఎస్సీ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని సదర వెంకటరెడ్డి ఫిర్యాదులు చేయిస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడడమే కాకుండా మానసికంగా కూడా హింసకు గురి చేస్తున్నాడని అన్నారు. అలాంటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు సిద్ధాంతుల కొండబాబు, జై భీమ్ రావు భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, బహుజన సమాజ పార్టీ జిల్లా అధ్యక్షులు మాత సుబ్రహ్మణ్యం తదితర దళిత గిరిజన సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు నాయకులు పాల్గొన్నారు.



## యువతా..! గంజాయి, సారాయి జోలికి వెళ్ళవద్దు..

### - ఎస్ఐ శివ కుమార్

### - లబ్బర్తిలో అవగాహన కార్యక్రమం

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** యువత గంజాయి, సారాయ జోలికి వెళ్లి ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని రాజవొమ్మంగి సబ్ ఇన్స్పెక్టర్ టి శివ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని లబర్తిలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. గంజాయిసాగు, రవాణాకు ప్రజలు దూరంగా ఉండాలని రాజవొమ్మంగి ఎస్సై శివ కుమార్ సూచించారు. అనంతరం గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

# భారత రాజ్యాంగ ప్రజాస్వామిక హక్కులు కాపాడాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జాతీయ ప్రజాస్వామ్య దినం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కాకినాడ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్నికల వ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించాలని, భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులు కాపాడాలని ఆందోళన చేపట్టారు. సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ అయితాబత్తుల రామేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది ఎండి జవహర్ అలీ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షాల పట్ల ఒకవిధంగాను, అధికార పార్టీ సభ్యుల పట్ల మరొక విధంగా వ్యవహరించడం ఎన్నికల కమిషన్ స్వతంత్రను దెబ్బ తీస్తుందన్నారు. మహాదేవపురంలో రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ సమాధానం గౌరవప్రదంగా లేదన్నారు. బీహార్లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కూడా పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రాజ్యాంగ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించకపోతే రాజ్యాంగానకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. భారత పౌరులంతా రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో కలిసి రావాలని రామేశ్వరరావు, జవహర్ అలీ అన్నారు. ఎస్సి, ఎస్టి యునైటెడ్ ఫోరం నాయకులు టి.నూకరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీలు మాట్లాడుతూ సెప్టెంబర్ 15 అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి ప్రజలను చైతన్య పరచడం సముచితంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో వ్యక్తి ఆరాధన రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. ప్రస్తుత దేశంలో మోడీ, అమిత్ షా జోడి ప్రజలను అణచివుంచి దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగాన్ని దెబ్బతీస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో, లౌకిక ప్రజాస్వామ్య భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని శేషబాబ్జి, నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో కాశి బాలయ్య, భయ్యా కుమార్, కె.మౌర్య, జి.సత్యానందం, రాంబాబు, ప్రశాంత్, మధు, లక్ష్మీపతి, కె.సత్తిరాజు, కె.నాగ జ్యోతి, టి.రాజి, సిహెచ్.విజయ్ కుమార్, టి.రాజా, జె.శేషు, ఆర్.రమేష్, వై.శ్రీనివాస్,యు సత్యనారాయణ, కొంకి రవి, నాగాబత్తుల సూర్యనారాయణ, పాలిక రాజేంద్రప్రసాద్, నందివాడ సుబ్బారావు, కర్రి నాగేశ్వరరావు, మోహన మురళీ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌పి బాలు వల్ల తెలుగు పాటకు ప్రపంచ ఖ్యాతి వచ్చింది

మొదటిపేజీ తరువాయి

భవిష్యత్తు ఉన్నా కరోనా మహమ్మారి తూటాకు బలై పోవడం మన దురదృష్టం అన్నారు, ఈ కార్యక్రమంలో గాలి సుబ్బరాజు ఫౌండేషన్ చైర్మెన్ గాలిసుబ్బరాజు,రాకా ప్రధాన కార్యదర్శి జి.వి.రమణ, గోదావరికల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి లు యర్రమోతు ధర్మరాజు, ముత్తాబత్తుల ఏడుకొండలు, పుసులూరి శేషుకుమార్, పి.వి.ఎస్ క్రిష్ణారావు, బర్రే సుబ్రహ్మణ్యం, బొబ్బిలి శ్రీనివాసరావు, ముద్దెడ్ల రమేష్, గాదిరాజు రామరాజు,అప్పన నాగభూషణం,రాకా ఉపాధ్యక్షులు తిరుమల క్రిష్ణమోహన్, ఎన్.వి.రావు, జనసేన నాయకులు ఎడ్ల మహేష్, బీరజయప్రకాష్, ఏఈ రాధాక్రిష్ణ, సత్తిరాజు, జలవనరులశాఖ సిబ్బంది పాల్గొన్నారు, దుర్గేష్‌ని దుశ్శా లువా, మెమెంటో, సావనీర్‌లతో రాకా కల్చరల్ అసోసియేషన్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

# జెఎన్టీయుకెలో విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

మొదటిపేజీ తరువాయి

కాదన్నారు. ఆర్&బి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.కంతు మాట్లాడుతూ ఉప్పాడ వద్ద సముద్ర తీర కోత నివారణకు, కెనాల్ గట్ల పగుళ్ల వంటి అంశాలపై సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశోధనలు జరిపి తీర ప్రాంత కోత నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెక్నికల్ అసోసియేషన్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ (టేస్) ను అతిథులు లాంఛనంగా ప్రారంభించి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, టేస్ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.యేసురత్నం, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌తో ప్రయోజనం

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయంలో సైతం సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచుకోవాలని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎలక్ట్రికల్ మరియు నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు మండల అభివృద్ధిపై దృష్టి సారించాలి

### - ఎమ్మెల్యే రాజప్ప




**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** అధికారులు మండలాభివృద్ధిపై దృష్టి సారించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అలాగే రోడ్లు, డ్రైన్లు, లింక్ రోడ్డులు నిర్మించడం జరిగిందని, త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు కూడా మండలాభివృద్ధికి కృషి చేయాలని ఆయన తెలిపారు. అనంతరం శాఖలవారీగా అధికారులు వారి యొక్క శాఖల పరిధిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పథకాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ నూనె మంగాలక్ష్మీ, ఎంపిటిసిలు, సర్పంచ్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# అపార్ట్మెంట్ పై నుండి కిందపడిన భవన నిర్మాణ కార్మికురాలు మృతి

**– మృతి చెందుతున్న భవన నిర్మాణ నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు భరోసా కరువు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడలో సాంబమూర్తి నగర్ ఆదిత్య డిగ్రీ కాలేజ్ ఎదురువీధిలో న్యూ కన్స్ట్రక్షన్ అపార్ట్మెంట్లో పనిచేస్తున్న రాయితి దుర్గ అనే భవన నిర్మాణ కార్మికురాలు ప్రమాదవశాత్తు మెట్ల పైనుండి కిందపడి మృతి చెందడం జరిగింది. ఆమెకు నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబం, పేట ప్రజలు, అధికార ప్రతినిధులు భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ నిరసనలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల బ్రతుకులకు భరోసా కరువైందని, భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలకు విలువ లేకుండా ఉందని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఈ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు అమలు చేస్తామని భవన నిర్మాణ కార్మికులుగా హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చి సంవత్సరం ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటికీ సంక్షేమ బోర్డు అమలు చేయలేదని, ఈ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ప్రసాద్ అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షలు యాక్సిడెంట్ క్లైయిమ్ మంజూరు అవుతుందని, అదేవిధంగా ఆంధ్ర రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే 10 లక్షల రూపాయలు సంక్షేమ బోర్డు ద్వారా చెల్లించాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల మృతుల పట్ల నిర్లక్ష్యం మొండి వైఖరి విడనాడి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పున ప్రారంభించాలని, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులను ప్రాణాలకు భరోసా కల్పించి వారిని ఆదుకోవాలని, బాధిత కుటుంబానికి నష్టపరహారం చెల్లించాలని ప్రసాద్ అన్నారు.

# శుభ్రమైన తాగునీరు అందించాలి - ఐద్వా డిమాండ్




**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో తూరంగి పంచాయతీ డ్రైవర్స్ కాలనీ నాలుగు ఐదు సచివాలయంలో వద్ద ఖాళీ బిందులు, మురికి కొళాయి నీరు సీసాలతో నిరసన తెలియజేయడం జరిగింది. సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు జి.భూలక్ష్మి మాట్లాడుతూ రెండు రోజులకు ఒకసారి కుటుంబానికి రెండు బిందెలు మాత్రమే ఇస్తూ మురికి నీరు ప్రజలు మురికి నీరు తాగితే డయేరియా లాంటివాటి బారిన పడతారని మండి పడ్డారు. డ్రైవర్స్ కాలనీలో ఏళ్ల తరబడి నీటి సమస్య పరిష్కారం చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి అన్నారు. ఈరోజుకి ప్రజలు తాగునీరు కోసం రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి ఉందంటే బాధాకరమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాల యం సిబ్బందికి వినతిపత్రం అందజేయగా సిబ్బంది సానుకూలంగా స్పందించారు. ఈ రోజే తాగునీరు ట్యాంకర్లు పంపిస్తామని, నాలుగు ఐదు రోజులలోపు సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా స్థానిక కమిటీ నాయకత్వం పట్టువర్తి పద్మావతి, వీరమణి, లలితా భవాని, దుర్గ భవాని, ఉమామహేశ్వరి, స్థానిక నాయకులు తట్టవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

# అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే



**కాకినాడ, మేజర్ న్యూస్ :** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్స్ డే ని ఘనంగా నిర్వహించారు. గోదారిగుంట, కాకినాడలోని ఎన్.బీఆర్ కన్స్ట్రక్షన్స్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భములో ఇంజి. నల్లం భాస్కరరావుని క్లబ్ అధ్యక్షుడు అల్లై. యాళ్ళ రత్నరావు శాలువా, పూలమాల మరియు మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధ్యక్షుడు అల్లై. యాళ్ళ రత్నరావు భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఈ వేడుక నిర్వహించామని, ఆయన భారతదేశ మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక ప్రణాళికలో విశేష కృషి చేశారని అన్నారు. ముఖ్య అతిథి పీడీజీ అల్లై. కొవ్వూరి మునిరెడ్డి మాట్లాడుతూ "సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు కేవలం ఇంజనీర్ మాత్రమే కాకుండా, దూరదృష్టి కలిగిన దేశనాయకుడు కూడా. ఆయన ఆలోచనలు, ప్రణాళికలు నేటి భారత అభివృద్ధికి పునాది. మన సమాజానికి ఇంజనీర్లు ఎంత అవసరమో ప్రతి ఒక్కరూ గుర్తించాలి. రోడ్లు, వంతెనలు, ఆనకట్టలు, పట్టణ ప్రణాళిక %-% ఇవన్నీ దేశ ప్రగతికి ఆధారం. నేటి యువ ఇంజనీర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పర్యావరణ పరిరక్షణతో కూడిన అభివృద్ధికి కృషి చేయాలి. ఇలాంటి ఇంజనీర్లను గౌరవించడం అంటే సమాజానికి వారు చేస్తున్న సేవలను గుర్తించడం" అని అన్నారు. సత్కారానికి స్పందించిన ఇంజి. నల్లం భాస్కరరావు మాట్లాడుతూ "నన్ను అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ గౌరవించడం చాలా ఆనందంగా ఉంది. ఇంజనీర్ అనేది కేవలం వృత్తి కాదు, సమాజానికి సేవ చేసే ఒక బాధ్యత. సర్ విశ్వేశ్వరయ్య చూపిన మార్గం ప్రతి ఇంజనీర్ అనుసరించాల్సినది. నేటి యువ ఇంజనీర్లు కొత్త ఆలోచనలతో, సాంకేతికతతో దేశ అభివృద్ధికి తోడ్పడాలి. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు, సృజనాత్మక నిర్మాణాలు జరగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లై. కుడిపూడి వెంకటేశ్వరరావు, క్లబ్ కోశాధికారి అల్లై. డామిశెట్టి శ్రీనివాసరావు, సత్య, దుర్గాప్రసాద్, లక్ష్మి, శ్రావంతి మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఎదుగుదల సమస్యలు ఎదుర్కొంటున్న మా కుమార్తెకు పింఛన్ ఇప్పించండి



కాకినాడ, మేజర్ న్యూస్ : వయసు ఆరున్నర ఏళ్లయినా ఆరు నెలల పాప మాదిరిగా శరీరం పెరుగుదల లేకపోవడంతో తమ కుమార్తె లక్ష్మీపూర్ణకు విభిన్న ప్రతిభావంతులు పింఛన్ అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు మల్లెల దుర్గాదేవి, అప్పారావు లు వేడుకున్నారు. సోమవారం చిన్నారి లక్ష్మీపూర్ణతో కలిసి కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ కార్యక్రమానికి దుర్గాదేవి, అప్పారావులు వచ్చారు. తమది రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామమని, బ్రతుకు దెరువు నిమిత్తం కాకినాడ ప్రాంతానికి వాచ్మెన్ పనులు చేసుకునేందుకు వలస వచ్చామన్నారు. పింఛన్ నిమిత్తం వివిధ కార్యాలయాలకు తిరిగామని, న్యాయం జరగలేదని అందువల్ల చిన్నారి లక్ష్మీపూర్ణకు విభిన్న ప్రతిభావంతుల కోటాలో పింఛన్ అందించాలని కోరారు. పింఛన్ విషయంపై వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందించగా చిన్నారి లక్ష్మీపూర్ణకు పింఛను అందించి న్యాయం చేస్తామని అధికారులు చెప్పినట్లుగా తల్లిదండ్రులు దుర్గాదేవి, అప్పారావులు తెలిపారు.

## కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రులు, జిల్లా కలెక్టర్

**– స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించిన జిల్లా అధికారులు**



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** అమరావతి రాష్ట్ర రాజధానిలోని వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో సోమవారం తొలిరోజు తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి, రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం 15 నెలల పాలన పూర్తి చేసుకుందని, దేశాన్ని నెంబర్ 1 స్థాయికి తీసుకెళ్లే ఆకాంక్షతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో నుండి 4వ స్థానానికి చేరిందని, మరో 22 ఏళ్లలో స్వాతంత్ర్యం వందేళ్లు పూర్తి అయ్యే సమయానికి భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సంస్కరణలు వద్దన్న రాజకీయ పార్టీలు గతంలో మనుగడ కోల్పోయినట్లు గుర్తు చేశారు. కేంద్రం వికసిత్ భారత్ 2047 ప్రణాళికను రూపొందించగా, ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర విజన్ 2047ను సిద్ధం చేసిందని, ఇది అధికారులందరికీ మార్గదర్శిగా ఉండాలని అన్నారు. ప్రస్తుతం వృద్ధిరేటు 10.5 శాతం ఉందని, ఈ ఏడాది తలసరి ఆదాయాన్ని రూ.3.47 లక్షలకు తీసుకెళ్లే లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు. 2029 నాటికి రాష్ట్ర జీఎస్డీపీని రూ.29 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ.4.67 లక్షలకు చేర్చడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ఆర్థిక అసమానతలను తగ్గించడం తమ విధానమని, జిల్లాల రూపురేఖల్ని మార్చడంలో కలెక్టర్ల బాధ్యత అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుండి జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, ఇతర జిల్లా అధికారులు పాల్గొనడం జరిగింది.

# ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**– గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గ్రీవెన్స్ లో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన వినతి పత్రాలు పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ సూచించారు. స్థానిక ఐటిడిఏ సమావేశం హాలులో సోమవారం వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, ఏపీఓ జనరల్ డి.ఎన్.వి. రమణ, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, సబ్ కలెక్టర్ పరిపాలన అధికారి ఎం.సావిత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ఈవారం సుమారు 70 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. మారేడుమిల్లి మండలంలో మారుమూల ప్రాంతంలో ఇజ్జులూరు గిరిజన గ్రామంలో 12 కుటుంబాలకు చెందిన 40 మంది ఉన్నామని, వారికి భద్రాచలం వెళ్లే మెయిన్ రోడ్ లో రెండు ఎకరాల భూమి మంజూరు చేసి ఇండ్లు ఏర్పాటు చేస్తే గ్రామస్తులందరూ తరలి రావడం జరుగుతుందని జిఎంవలస సర్పంచ్ కారం లక్ష్మి, సాధల భీమిరెడ్డి, సాధల రామిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీలో రబ్బరు రైతులకు 20 రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేయాలని రేవుల జానకి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం చింతలపూడి నుండి పెరికి వలస వరకు గ్రామాల మధ్యలో ఆరు కిలోమీటర్లు రోడ్డు మంజూరు చేయడం జరిగిందని అదేవిధంగా నాలుగు కిలోమీటర్లకు ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేయాలని, అదేవిధంగా కోట గ్రామం నుండి వలస గ్రామాల మధ్యలో కాలువపై వంతెన నిర్మించాలని, అదేవిధంగా చింత కొయ్య కన్నేరు వాగుపై వంతెన నిర్మించాలని, అదేవిధంగా బుల్లోజిపాలెం జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని చింతలపూడి సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ, వైస్ ఎంపీపీ జోగి రెడ్డి, కత్తుల ఆదిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. ఆరు సంవత్సరాల నుండి తమ రేషన్ కార్డులో చనిపోయినట్టు రేషన్ కార్డులు చూపిస్తుందని తమకు రేషన్ కార్డులు లేవని, రేషన్ కార్డులు సమస్య పరిష్కరించాలని దేవీ పట్నం మండలం మామిడివలస గ్రామానికి చెందిన మడి వినోద్ కుమార్, వంజం హర్షవర్ధన్, ముచ్చిక దివ్య, ముచ్చిక బుచ్చిరాజు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డిఎల్డిఓ కె.కోటేశ్వరరావు, పిహెచ్ఓ దేవదానం, ఎడీఏ కె.సావిత్రి, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియల్, సుబ్బయ్య, రవికుమార్, ఏడిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ డేవిడ్, తహసిల్దార్ బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో వై.రాజబాబు, పిఏఓ ఎల్ రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, మల్లికార్జున రావు, సుబ్బయ్య, భవానీ, రమేష్, ఏఎంఓ విజయభాస్కర్, వెలుగు ఏపిడి దేగలయ్య, డాక్టర్ స్పందన, డిప్యూటీ తహసిల్దార్లు శ్రీధర్, స్వామి, సూపరింటెండెంట్ బి.కిషోర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.లక్ష్మణ్, సిడిపిఓ కె.ఉమ, పీఎంయు అధికారిణి చంద్రకళ, వ్యవసాయ శాఖ అధికారులు కె.లక్ష్మణ్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

**– అదనపు కమిషనర్ సుధాకర్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే.టి. సుధాకర్ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఏడుగురు ఫోన్ ద్వారా తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అదనపు కమిషనర్ కే.టి. సుధాకర్ పాల్గొని నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని.. పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. 13కి పైగా సమస్యలపై అర్జీలు అందాయి. వాటిపై అదనపు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి



అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి.వెంకట్రావు, డిసిపి కృష్ణారావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, ఈఈ లు కామేశ్వరరావు, మాచిరాజు, ఏసీపీ శ్రీధర్, మేనేజర్ సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి, ఆర్వో సిరీస్ పాల్గొన్నారు.

## భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం

**– జేసీ రాహుల్ మీనా**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** దేశంలో అనేక సాగు, తాగు నీటి ప్రాజెక్టుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి ఇంజనీర్స్ దినోత్సవ కార్యక్రమం కాకినాడ గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేసీ రాహుల్ మీనా, రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జేసీ రాహుల్ మీనా ప్రారంభించి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఇంజనీరింగ్ రంగానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.

కుటుంబ పరిస్థితులు అంతగా సహకరించకపోయిన పట్టుదలతో మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజనీర్‌గా చదువు పూర్తి చేశారన్నారు. ఇంజనీరుగా మన దేశ పేరు ప్రఖ్యాతలను నలుదిశలా చాటి, ఇంజనీరుగా అత్యున్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన జన్మదినాన్ని ఇంజనీర్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. నేటి యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జేసీ రాహుల్ మీనా ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, మన సంస్థ మాజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్ర జలశక్తి మంత్రిని కలసిన సిపిఐ (యం) బృందం





**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** సిపిఎం రాజ్యసభ పార్లమెంట్ పక్ష నాయకుడు జాన్ బ్రిట్టాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. సురేంద్ర, పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన్న. కిరణ్, ధర్ముల. రమేష్ తదితరులు కేంద్ర జలశక్తి మంత్రిని కలసి, పోలవరం నిర్వాసితుల సమస్యలు తెలియజేశారు.పోలవరం నిర్వాసిత గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకోవడం కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, నిర్వాసితుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవడం కోసం అతి త్వరలోనే కమిటీని ముంపు ప్రాంతాల్లో పర్యటనకు పంపిస్తానని సిపిఎం బృందానికి మంత్రి హామీ ఇచ్చారు.

## కలెక్టర్ల కాన్ఫరెన్స్ వీసీలో పాల్గొన్న జేసీ రాహుల్ మీనా






**కాకినాడ, మేజర్ న్యూస్ :** కలెక్టర్ల కాన్ఫరెన్స్ వీసీకి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా హాజరయ్యారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 4వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు సోమవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి ఆయన .. ట్రైనీ కలెక్టర్ మానీషాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశా నిర్దేశనం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీవో పీ.త్రినాథ్, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ సీహెచ్.రత్నరాజు, ఏడి సర్వే కె.శ్రీనివాసు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే

**– విశ్రాంత ఉద్యోగి ఇంజనీర్ వెలుగుబంట్ల విజయకుమార్‌ని దుస్సాలువతో సత్కరించిన లైన్స్ క్లబ్**

**– ఈ సత్కారం మా సేవలకు గౌరవ వందనం : వెలుగుబంట్ల**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతి15 సెప్టెంబర్ పురస్కరించుకుని లైన్స్ క్లబ్ కాకినాడస్టార్స్ ఆధ్వర్యంలో 58వనేషనల్ ఇంజనీరింగ్ డేచాలాఅద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణంలో గల ప్రముఖ ఇంజనీర్లు 11 మంది ఇంజనీర్లను లైన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ తరఫున ఘనంగా సన్మానించడం జరిగింది.

అందులో భాగంగానే మహారాష్ట్ర పూణేలో బజాజ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా పని చేసి రిటైర్ అయి, ప్రస్తుతం కాకినాడ కోటక్ లైఫ్‌లో ఏ.ఎస్. ఎమ్.గా విధులు నిర్వహిస్తున్న తిమ్మాపురం అవంతి నగర్ పవిత్ర గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్న వెలుగుబట్ల విజయకుమార్‌ను లైన్స్ క్లబ్ దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజాజ్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా సుమారు 29 సంవత్సరాలు విధులు నిర్వహించానని, అనంతరం నా స్వస్థల మైన కరప మండలం వేములవాడ గ్రామానికి చెందిన వాడిని అని ఆనాడు కష్టపడి చదువుకుని ఒక ఇంజనీర్‌గా ఇతర రాష్ట్రాల్లో ఉద్యో గం చేసి మళ్లీ తిరిగి ఇక్కడికి రావడం జరిగింది అన్నారు. ఇలాంటి సత్కారాలు మనసుకు ఎంతో ఆనందాన్ని, గౌరవాన్ని కలిగిస్తాయని, ఈ సత్కారాలు మా సేవలకు గౌరవ వందనం లాంటివి అని అనా న్నరు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్‌స్టార్స్ సంఘసభ్యులు పాల్గొన్నారు.

# దోమలతో ప్రజలు బెంబేలు

- గ్రామాల్లో మంచం పట్టిన పారిశుద్ధ్య పనులు
- వర్షాల కారణంగా వేగంగా వృద్ధి చెందిన దోమలు
- అధికారులు,పాలకుల తీరుపై ప్రజలు అసహనం
- జాడలేని ఫాగింగ్,బ్లీచింగ్



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి.ఇటీవల వర్షాలు కురవడంతో దోమల వృద్ధి వేగంగా జరుగుతోంది. అంతే కాకుండా పారిశుధ్య పనులు లోపించడంతో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదరాలు పేరుకుపోయాయి. దీంతో గుంపులు గుంపులుగా పుట్టుకొచ్చి దోమలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సాయంత్రమైతే చాలు చెరువులు, కాలువలు,పిచ్చిమొక్కలతో నిండిన ఖాళీ ప్రదేశాలు అనుకుని ఉన్న కాలనీల్లో ప్రజలు తలుపులు తెరవాలంటేనే భయపడిపోతున్నారు. వీధుల్లో డ్రైనేజీలను రోజుల తరబడి శుభ్రపరచకపోవడం.మురికి నీటిపై దోమలు వేగంగా వృద్ధి చెందుతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు.దోమల నియంత్రణ చర్యలను మొక్కుబడిగా చేపడుతూ ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ పరిస్థితి ప్రతి గ్రామ పంచాయతీలో మరింత అధ్వానంగా తయారైంది.వర్షాకాలం ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వీధుల్లో ఫాగింగ్,బ్లీచింగ్ వంటి పారిశుధ్య పనులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది.వర్షాకాలం ప్రారంభమైందంటే గతంలో గ్రామాల్లో విరివిరిగా దోమల నివారణ చర్యలు చేపట్టేవారు.ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి కూడళ్ళు,టైర్ల కొట్లు,డ్రైనేజీల్లో నీరు నిలువ ఉండకుండా ప్రజలకు అవగాహన చర్యలు చేపట్టేవారు.కొబ్బరి బోండాల్లోనూ నీరు నిలువ ఉండకుండా వాటిని జనావాసాల నుంచి దూరంగా తరలించేవారు.ఇళ్లు, పరిసరాలతో పాటు నిర్మాణంలోని నీటి ట్యాంకులు,వ్యర్థాలు,పాత సామగ్రిని తనిఖీ చేసేవారు.నీటి నిల్వలు తొలగించి,దోమల మందు పిచికారీ చేసేవారు.ఇటీవలే వర్షాలు కురవడంతో సహజంగానే బయటి వాతావరణంలో పలు రకాలుగా నీటి నిల్వలు పెరిగాయి. ముఖ్యంగా వినియోగంలో లేని భవనాలు,ఖాళీ ప్రదేశాలు, నిర్మాణంలో ఉన్న కట్టడాల వద్ద దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.దోమల నివారణలో ఫాగింగ్ ప్రధానం. పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నప్పటికీ వాటి సేవలను ఇంతవరకు వినియోగించిన దాఖలాలు లేవు.వీధులలో కనీసం బ్లీచింగ్ కూడా చల్లించకపోవడం దారుణం.అంతే కాకుండా పలు పంచాయితీల రికార్డుల్లో మాత్రం ఎప్పటికప్పుడు దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు,బ్లీచింగ్ వాడకలపై నమోదు చేస్తుండటం కొసమెరుపు.పరిసరాలు పరిశుభ్రంగా లేని కారణంగా వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది.దోమకాటు వల్ల మలేరియా,డెంగ్యూ,చికన్ గున్యా లాంటి విష జ్వరాలు సోకి ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.ఆస్పత్రులలో జ్వరపీడితులు చికిత్స పొందుతున్న ప్రస్తుతానికి వైరల్ జ్వరాలతో ప్రజలు బాధ పడుతున్నప్పటికీ అధికారులు,పాలకులు పట్టించుకోకపోవడంపై వైఖరిపట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల బారిన పడకుండా రక్షించే విధంగా ఫాగింగ్,బ్లీచింగ్ చల్లడం వంటి పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

## అన్నా క్యాంటీన్‌లో పేదలకు ఉచిత అన్నదానం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ కు ఈ వారం గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్, మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్వీఎస్ మాట్లాడుతూ గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్ జాస్తి వసంత్ ఆర్థిక సాయంతో అన్న క్యాంటీన్ పేదలకు అన్నదానం నిర్వహించామని, తొందరలోనే జగ్గంపేటలో ప్రభుత్వఅన్న క్యాంటీన్ ఏర్పాటు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, టిడిపి యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములకొండ జోగారావు,జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, లారీ యూనియన్ అధ్యక్షులు మారిశెట్టి రాధా, రాష్ట్ర డైరెక్టర్ గెద్దాడ సత్యవేణి, చిరంజీవి, రాయి సాయి, ఎస్ చంద్రశేఖర్, యల్లమిల్లి సీఎం, అల్లు అంజిబాబు, నలామాటి ఆనంద్, దుర్గపు ప్రకాష్, దేగల సత్తిబాబు, నకిరెడ్డి సూర్యవతి, కొత్త ప్రసాద్, అన్నకాంటీన్ ఇంచార్జి ఎండి కాజా, చెలికాని హరిగోపాల్, వానశెట్టి శ్రీను, పోలినాటి ఏ బ్రా శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 అర్జీలు



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబం ధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎడిఎ దైవకు మార్, డివిఎల్ పిఓ కార్యాలయ ఏఓ మైథిలి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, హెచ్‌డబ్ల్యూలు రమేష్, శ్రీవల్లి, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## లండన్ కిడ్స్ స్కూల్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు




**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ధవళేశ్వరం స్థానిక లక్ష్మీనరసింహ నగర్ కాలనీలో ఉన్న లండన్ కిడ్స్ స్కూల్ ఆవరణలో ఈ రోజు గ్రాండ్ పేరెం ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. స్కూల్ పిల్లలో గ్రాండ్ పేరెం ట్స్ పట్ల అభిమానాలను, ఆప్యాయతలను పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ఈ వేడుకలను నిర్వహించామని స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ ఫాతిమా ఫిర్దోజ్ తెలిపారు. ఈ వేడుకలో చిన్నారులు చేసిన నృత్యాలు, తదితర కార్య క్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్ర మంలో పాల్గొన్న పిల్లలకు ప్రిన్సిపాల్ మేడమ్ మెమెంటోలను అందచేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లితండ్రులు,గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో ముమ్మరంగ డ్రైనేజ్ పూడికతీత పనులు

- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి-సర్పంచ్ రమణి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని రాజవొమ్మంగి పంచాయతీకి చెందిన రాజవొమ్మంగి గ్రామంలో డ్రైనేజ్ పూడిక తీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణిఆధ్వర్యంలో డ్రైనేజీ పూడిక తీత పనులు గొల్లపల్లి వారి వీధి, దుర్గా నగర్, కొంగర వెంకటరెడ్డి వీధి, బీసీ కాలనీ, కమ్మరిపేట తదితర వీధుల్లో విజయవంతంగా పూర్తి చేశారు. గోకవరం నుంచి తీసుకు వచ్చిన కూలీలు పని చేస్తున్నారు. ప్రతి సంవత్సరం పుడిక తీత పనులు వర్షాకాలం ముందే చే పట్టడం జరుగుతుంది.గ్రామ సర్పంచ్ రమణి ప్రజలందరికీ శుభ్రతపై ప్రత్యేక గమనికలు అందజేసి, వర్షాకాలం మొత్తం వేడి నీళ్లు మాత్రమే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమం ప్రజా ఆరోగ్యం మెరుగుదల కోసం ప్రతి సంవత్సరం చేప పట్టడం జరుగుతుంది అన్నారు. వర్షాకాలంలో నీటిని నింపే ప్రాంతాల్లో తగిన శుభ్రత లేకపోతే సీజనల్ వ్యాధులు నియంత్రణలో ఉంచడం కష్టం అవుతుందని గ్రామ ప్రజలందరూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యకరమైన పంచాయతీకి సహకరించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐబిసి డైరెక్టర్, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, వార్డ్ మెంబర్ దేవి,తదితరులు ఉన్నారు.

## జాతీయ శక్తిని చాటి చెప్పే భాష హిందీ

- రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత హిందీ పండిట్ సత్యనారాయణ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల హిందీ శాఖ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. హిందీ భాషా దినోత్సవ వేడుకలు ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగాయి. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగాలు సాధించాలంటే విద్యార్థులు హిందీ భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత, సామర్లకోట జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకులు కె వి వి సత్యనారాయణ మాట్లాడుతూ హిందీ భాషను ప్రేమించడమంటే దేశాన్ని ప్రేమించేనట్లే అని అన్నారు. జాతీయ శక్తిని చాటిచెప్పే భాష హిందీ అని, గానానికి, ఉపన్యాసానికి అనువైన భాష హిందీ అని, విద్యార్థులు పఠన, భాషణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు.

విద్యార్థులు మాతృభాషతో పాటు జాతీయ భాషను కూడా నేర్చుకుని అన్ని రంగాలలో అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 14వ తేదీన నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ఈ సదస్సులో ముఖ్యఅతిథి సత్యనారాయణ చేతులమీదుగా ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన హిందీ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల చైర్పర్సన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, హిందీ అధ్యాపకులు ముంతాజ్, తెలుగుశాఖాధిపతి టీ తేజేశ్వరరావు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో వేద-2కె 25 జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం



**-వివిధ దేశాల నుండి 14,340 మంది హాజరైన విద్యార్థులు**

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** భారతదేశపు తొలి ఇంజనీర్ అయిన మ్రోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఇంజనీరింగ్ డే సందర్భంగా విద్యాస్ఫూర్తితో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం( వేద ) ఘనంగా ప్రారంభమైంది. ఈ సంవత్సరం వేదను "డీప్ టెక్ ఉ ఇంజనీరింగ్ ఎక్సలెన్సీ : డ్రైవింగ్ ఇండియాస్ టెక్ డే " అనే స్ఫూర్తిదాయకమైన అంశంతో నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా.నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జె.ఎన్.టి.యు.కె వైస్ ఛాన్సలర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో. ఎం.బి.శ్రీనివాస్, ప్రో . వైస్ ఛాన్సలర్ (అకడమిక్) డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్,డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, వేద - 2కె 25 కోఆర్డినేటర్ డా. డి.కిషోర్ పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రో ఛాన్సలర్ డా. ఎన్. సతీష్ రెడ్డి వేద ప్రారంభం మరియు దాని స్థిరమైన వృద్ధిని గుర్తుచేసుకుంటూ, ఇది జాతీయ స్థాయిలో సాంకేతిక ప్రతిభను మరియు ఆవిష్కరణలు పెంపొందించే వేదికగా ఎలా రూపుదిద్దుకుంది అనే వివరాలు వివరించారు. వేద యొక్క వ్యాప్తి మరియు ప్రభావాన్ని ప్రతి సంవత్సరం విస్తరింపజేసి నిర్వాహక బృందం కృషిని ఆయన ప్రశంసించారు. ముఖ్య అతిథి డా. సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ తన ప్రధానోపన్యాసంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో పోటీతత్వాన్ని కొనసాగించడానికి ఉత్తమ సాధన, నిరంతర నైపుణ్యాభివృద్ధి అవసరాన్ని పునరుద్ఘాటించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలను చేసి భవిష్యత్‌కు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. వేద కన్వీనర్ డా. కిషోర్ తన ప్రసంగంలో, ఈ సంవత్సరం దేశ నలుమూలల నుండి 14,340 మంది విద్యార్థులు వేదలో వివిధ సాంకేతిక పోటీలకు, ఈవెంట్లకు నమోదు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థుల సాంప్రదాయ నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది ఆదిత్య యాజమాన్యం తరుపున అతిధులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు పరిశీలించిన ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు. ఇంజనీర్ల ప్రతిభకు అద్దం పడుతూ ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థి చి. డొంకిన వీర భాగ్యేష్ వ్రాసిన కవిత విశేషంగా ఆకట్టుకుంది.

## నిడమర్తి రాజ్ కుమార్‌కు పలువురు అభినందనలు



**జగ్గంపేట,మేజర్‌న్యూస్** :2025 మెగా ఊజాలో జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన నిడమర్తి రాజ్ కుమార్ తండ్రి ఇశ్రాయేలు అనే యువకునికి ూ+ు గా అవకాశం దక్కడంతో పలువురు అభినం దించారు. జె. కొత్తూరు గ్రామానికి చెందిన దళిత సామాన్య కుటుంబానికి చెందిన ఈ యువకుడు ఎంతో కష్టపడి తన విజయంతో ఇటు కుటుంబానికి, అటు జె.కొత్తూరు గ్రామానికిఎనలేనిగౌరవాన్ని తెచ్చాడన్నారు. గ్రామంలో ూజ సామజిక వర్గం నుండి మొట్ట మొదటిగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన ఘనత సాధించాడన్నారు. ఈ సందర్భంగా నిడమర్తి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వానికి, జ్యోతుల ఫౌండేషన్ వార్కి, ఇందుకు సహకరించిన అందరికీ ముఖ్యంగా జె. కొత్తూరు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం సంక్షేమం - అభివృద్ధి పట్ల అంకితభావం కలిగి ఉంది

**-రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** కడియం మండలం కడియం గ్రామంలో నాబార్డ్ నిధులతో రూ.2 కోట్లు 60 లక్షల వ్యయంతో కడియం నుండి జేగురుపాడు వరకు నిర్మించబడనున్న కొత్త కెనాల్ రోడ్ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని సోమవారం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ - కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సంక్షేమ పథకాలు పట్ల ప్రభుత్వ అంకితభావాన్ని కలిగి ఉందన్నారు. ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం ను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామిగా మారేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ రహదారి సదుపాయాల విస్తరణ, విద్యుత్ సరఫరా మెరుగుదల, మహిళా శ్రేయస్సు, విద్యారంగం అభివృద్ధి, వ్యవసాయానికి తగిన మద్దతు వంటి అనేక రంగాలలో కూటమి ప్రభుత్వం విస్తృతంగా కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పిఠాపురం చేరుకున్న యుటిఎఫ్ రణభేరి యాత్ర

**-విద్యా ఆర్థిక సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావిస్తా -ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి**



**పిఠాపురం,మేజర్‌న్యూస్** :ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో... కొనసాగుతున్న 'రణ భేరీ' యాత్ర సోమవారం పిఠాపురం చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక యుటిఎఫ్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఉప్పాడ బస్టాండ్ వద్ద ఎమ్మెల్సీ బి. గోపి మూర్తి మీడియాతో మాట్లాడుతూ... విద్య, ఆర్థిక సమస్యల మీద రణభేరి పేరుతో రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో సాగుతోందని, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించిన ఈ యాత్ర తునిలో ప్రారంభమై 19వ తారీఖున ఏలూరులో ముగుస్తుందన్నారు. పాఠశాల తెరిచి రెండు నెలలు పూర్తికావస్తున్నా... ఉపాధ్యాయుడు స్వేచ్ఛగా తరగతి గదికి వెళ్ళి పాఠాలు చెప్పే పరిస్థితులు లేవన్నారు. మెగా పేరెంట్స్ డే, యోగా డే పేరుతో అటు వారం ఇటు వారం ఫోటోలు ఆన్లైన్ చేయడం, రాష్ట్ర విద్యా కమిషనర్ విజయరామరాజు ప్రతిరోజు వెబ్ యక్స్ లతో విద్యాపరమైన కార్యక్రమాలు కాకుండా... బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని, పేద విద్యార్థులను కావాలనే నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. బోధనేతర పనులు, ఆన్లైన్‌పనులుతొలగించాలని, కేవలం ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు.ఐదుసంవత్సరాల పి.ఆర్.సి కాలంలో... ఇప్పటికే రెండు సంవత్సరాల నాలుగు నెలల కాలం పూర్తయిందని, కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు పిఆర్సి కమిషన్ వేయలేదని, ఈ సంవత్సర కాలంలో ఒక్క డిఏ కూడా ఇవ్వలేదని, నాలుగు డిఏలు పెండింగ్లో ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాల క్రితం ఎర్న్ లీవ్ లు సరెండర్ చేస్తూ పెట్టిన బిల్లులు ఇప్పటివరకు కాలేదని, డిఎ, గత పిఆర్సి బకాయలుదాదాపు 25వేలకోట్ల రూపాయలు ఆర్థిక బకాయిలు ఉన్నాయని, పిఆర్‌సికి సంబంధించిన అంశాలు, ఆర్థికపరమైన అంశాలు పరిష్కరించాలని కోరుతూ...

ఈ సంవత్సర కాలంలో అనేక మార్లు యూటీఎఫ్, ఫ్యాప్టో, జేఏసీగా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లామని, కానీ అవి పరిష్కారం కాలేదని,అనివార్యంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పాఠశాల నుంచి సమస్యలను సేకరిస్తూ 19వ తారీకు వరకు రాష్ట్రవ్యాప్తంగా రణభేరీ యాత్రలు చేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 25వ తేదీన పదివేల మంది ఉపాధ్యాయులతో పెద్ద బహిరంగ సభ జరిపి ఈ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేస్తామన్నారు. జరగబోయే సమావేశాల్లో... పిడిఎఫ్ ఎమ్మెల్సీగా పాఠశాలలు, ఉపాధ్యాయ, ఆర్థికపరమైన సమస్యలను ప్రస్తావిస్తానని, ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నానని, అండగా ఉంటానని, ప్రభుత్వం కూడా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నాతి బుజ్జి బాధ్యతల స్వీకరణ



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండల ఎంపీడీవోగా, అనంతరం ఏలూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థలో డిఎల్డిఓగా పదోన్నతి పొందిన నాతి బుజ్జి సోమవారం తూర్పు గోదావరి జిల్లాలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా సోమవారం పదవిని బాధ్యతలు స్వీకరించారు. ఈ నియామకం డిప్యూటేషన్ ఆధారంగా జరిగిందని, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు, హౌసింగ్ శాఖ సిబ్బంది నాతి బుజిని అభినందించారు. ఇప్పటి వరకు హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా కే ఆర్ సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే భాస్కర్ రెడ్డి బాధ్యతలు నిర్వహించడం జరిగింది.

### కలెక్టర్ల సమావేశంలో తూర్పు ఆర్‌ఎస్‌కే సిబ్బందికి ప్రశంసలు

**-గణనీయమైన జీవీఏ సాధనలో ప్రత్యేక కృషికి అభినందనలు**

**-జె.సత్యవేణిని స్ఫూర్తిగా తీసుకోవాలి**

**-కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జిల్లా కలెక్టర్ల తొలి రోజు సమావేశంలో సోమవారం తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు, జిల్లా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రాథమిక రంగంపై వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ప్రాథమిక రంగమైన వ్యవసాయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, రైతు సేవా కేంద్రాల వరకు డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అమెరికా విధించిన పన్నుల భారంతో రొయ్యల పరిశ్రమ సవాళ్లు ఎదుర్కొంటోందని, రాబోయే రబీ సీజన్‌లో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో అత్యుత్తమ ప్రదర్శనలో భాగంగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఆర్‌ఎస్‌కే సిబ్బంది విశేష ప్రతిభను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది.రైతు సేవా కేంద్రాల వారీగా చూస్తే తూర్పు గోదావరి జిల్లాలో బిక్కవోలు మండలంలోని భలభద్రాపురం-1, 2, 3, అరికరేవుల రైతు సేవా కేంద్రాలు ముందు వరసలో నిలిచాయి. బిక్కవోలు మండలం కాపవరం రైతు సేవా కేంద్రం పశు సంవర్ధక శాఖ సహాయకురాలు జె. సత్యవేణి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.816 కోట్ల జీవీఏ సాధించగా, ఈ సంవత్సరం రూ.895.14 కోట్ల లక్ష్యాన్ని ముందుకు పెట్టుకోవడం విశేషమని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "జె. సత్యవేణి సాధించిన విజయాలు ఇతర సిబ్బందికి స్ఫూర్తిదాయకం. అందరూ ఇలాంటి అంకితభావంతో పనిచేస్తే జిల్లా స్థాయిలో మరింత మంచి ఫలితాలు సాధించవచ్చు" అని అభినందనలు తెలిపారు.

## ధవళేశ్వరంలో బాలుడు మిస్సింగ్



**ధవళేశ్వరం,మేజర్‌న్యూస్** : ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతానికి చెందిన తేటకాల రాము వాళ్ళ అబ్బాయి తేటకాల వరుణ్ (11) సోమవారం ఉదయం 6:45 నిమిషములకు నిద్ర లేచి ఇంట్లో వారికి చెప్పకుండా ఇంటి వద్ద నుండి వెళ్లిపోయాడు. ఇతను స్థానిక హర్షవర్ధన స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్నాడు.

వెళ్లేటప్పుడు అతని వేసుకున్న మెరూన్ కలర్ టీషర్ట్ బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడనీ దయచేసి ఎర్ర కొండ పరిసర ప్రాంత వాసులకు కానీ లేదా ధవళేశ్వరంలోని వారికి గాని కనిపిస్తే వెంటనే ధవళేశ్వరం పోలీసు వారికి తెలియజేయండి. లేదా ధవళేశ్వరం సిఐ నెంబర్‌కు 9440796586 సమాచారం ఇవ్వగలరు.

# సిపిఎంపై తప్పుడు ఆరోపణలు చేయటం మానుకో -సిపిఎం



కూనవరం, మేజర్ న్యూస్ : 3 రోజుల క్రితం ఎటపాక మండలంలో గిరిజనేతరుల భూస్వాముల మీటింగ్‌కి హాజరై వెంకయ్య అనే వ్యక్తి బిజెపి పార్టీ పేరు చెప్పి ,సిపిఎం పై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని కూనవరం సిపిఎం నాయకులు హితవు పలికారు. భూస్వాముల పక్కన ఒకల్ల పుచ్చుకున్న ఈ పెద్ద మనిషి వారికి ఇచ్చిన భరోసా ఫెయిల్ అయినది కావున ఫ్రస్టేషన్ కి గురై పెద్ద పెద్దగా సిపిఎం పై అరుపులు కేకలతో మీటింగ్లో అవాస్తవాలు ప్రస్తావించటం చూస్తే వెంకయ్యకు మతిభ్రమించినట్లు కనబడుతున్నది అనివారు అన్నారు ఈ పెద్ద మనిషి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులను కూడా రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రస్తావిస్తూ ఆరోపణలు చేస్తుండటాన్ని చూస్తే ఈయనను త్వరలో ఎర్రగడ్డ ఆసుపత్రికి తీసుకు వెళ్లాల్సి వస్తుంది అని అనుమానం కలుగుతున్నది, ??ఈయన సిపిఎంలో ఉన్నప్పుడు పార్టీ పోడు భూముల భూ పోరాటంలో ప్రజలు పోడుభూమి కొడితే నువ్వు అందులో ఆరు ఎకరాలు ఆక్రమించుకున్నది ఇప్పుడు మామిడి తోట ఏసినది వాస్తవం కాదా వెంకయ్య నువ్వు భూస్వాములు వద్ద ఏమి చీకటి ఒప్పందం వున్నదో అది బూమ్ రాంగ్ అవుతున్నది అనే విషయం నీకు అర్థమై ది కదా వెంకయ్య అధికారులు ప్రభుత్వ పెద్దలకు నువ్వు చేసే ప్రకటనలు తప్పుడవని చట్ట వ్యతిరేకమైనవి అని నీకు అర్థమైందా వెంకయ్య ఆర్ పురం మండలం చొక్కనపెల్లి గ్రామంలో గిరిజనులు స్వయంగా వరినారు, పెద్ద మట్టపల్లి గ్రామం వెల్లి నారు పీక్కోచ్చి భూ పోరాటం లో భాగంగా వరి నాటు వేస్తే ,వాస్తవాన్ని దాసి ఎటపాక రైతులను రెచ్చగొట్టడానికి,దాన్ని మీటింగ్లో అక్కడ రైతులను మభ్యపెట్టడానికి కాదా నువ్వు తప్పుడు ప్రకటనలు చేస్తున్నది నువ్వే అఖిలపక్షం కూటమి అని పూటకొక ప్రకటనలు ఇస్తున్నావు నిజంగా నీ కూటమిలోని ,మండల ప్రెసిడెంట్లు వారి వారి పార్టీలు వారు ఎక్కడైనా నీ మీటింగ్‌లో పాల్గొన్నారా వెంకయ్య కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్నది మూడు దపాలుగా కొనసాగుతున్నారు, నీకు దమ్ము ధైర్యం ఉంటే నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ మరియు నష్టపరిహారం తో పాటు గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు =/= ఇప్పించు అంతేకానీపిచ్చి ప్రకటన మానుకో వెంకయ్య కేంద్రంలో అధికారంలో ఉండి బిజెపి పార్టీగా చెప్పుకున్న మీరు ప్రజలను మోసం చేస్తూ మభ్యపెడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత,ప్రయారిటీ గ్రామాలను కేంద్రం అప్రూవల్ చేర్చకుండా తప్పుడు సర్వేలు చేస్తూ ప్రజలని నిర్వాసితులను తప్పుదోవ పట్టించడానికి సిపిఎంపై ఆరోపణ చేస్తున్నట్లు ప్రజలకు తెలుసు వెంకయ్య, నువ్వు నీ రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే సిపిఎం పై అవాకులు చవాకులు అవస్తవాలు మాట్లాడటం బురదజల్లే కార్యక్రమాన్ని మానుకో వాల్లని హితవు పలికే నారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు నాగమణి , పార్టీ మండల కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

# యువత రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలి

సామర్లకోట, మేజర్ న్యూస్ : సమాజంలో యువత రక్తదానం చేసి మరొకరి ప్రాణం నిలపడానికి రక్తదానం చేయాలని కాకినాడ పార్లమెంటరీ తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసచార్యుల చౌదరి ( శీను బాబు) పిలుపునిచ్చారు. మండలంలో జి. మే డపాడు గ్రామంలో గల సీతారామ కమ్యూనిటీ హాల్లో జిల్లా తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో యువత జోరుగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్త దానశిబిరాన్ని ప్రారంభించిన శ్రీను బాబు మాట్లాడుతూ అనేక యాక్సిడెంట్లలో గాని ప్రాణాంతక సమయాల్లో గాని సమాజంలో ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతుందని కావున ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. స్థానిక సీతారామ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో కాకినాడ రోటరీ బ్యాంకు డాక్టర్ కామరాజు మరియు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం ఇచ్చిన వారందరికీ తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ ఆధ్వర్యంలో ప్రోత్సాహ పత్రాలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో



సొసైటీ అధ్యక్షులు పాలకుర్తి రవిబాబు జనసేన నాయకులు జానా వెంకటరావు జానా శ్రీను కంచుమర్తి రాజన్న తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ సంఘం అధ్యక్షులు నూక రెడ్డి శ్రీనివాసు ఉపాధ్యక్షులు పిల్లా సత్యనారాయణ, పటాని వెంకట్రావు, సెక్రెటరీ పైలా సత్యనారాయణ జాయింట్ సెక్రెటరీ దేగల వీరబాబు ట్రెజరర్ జామి ఏసుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా వ్యాధి నివారణలో భాగంగా చెరువుల్లో చేప పిల్లలు విడుదల

- చేప పిల్లల్ని విడుదల చేసిన ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్



చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు ఐటిడిఏ, ఆధ్వర్యంలో గంబూసియా చేప పిల్లలను చెరువులలో విడుదల చేశారు. మలేరియా వ్యాధి నియంత్రణలో భాగంగా ఐటిడిఏ, చింతూరు పరిధిలోని ఎంపిక చేసిన చెరువులు మరియు కొన్ని నీటి వనరులలో సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొఖ్వల్ ఆధ్వర్యంలో గంబూసియా చేప పిల్లల విడదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ డివిజన్‌లో 23 చెరువులు/ నీటి గుంటలు గుర్తించి 30,000 గంబూసియా చేపలను విడుదల చేయడం జరిగిందని తెలియచేసారు. ఈ చేపలు దోమల లార్వాలను ఆహారంగా తీసుకుని సహజసిద్ధంగా దోమల పెరుగుదలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి అని అన్నారు. దీంతో మలేరియా వ్యాప్తి నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. రసాయనాలపై ఆధారపడకుండా, పర్యావరణానికి హితమైన ఈ జీవ వైజ్ఞానిక పద్ధతి ద్వారా దోమల లార్వాలను నిర్మూలించడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ మలేరియా నివారణలో భాగస్వాములు కావాలని ప్రాజెక్ట్ అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డా. పుల్లయ్య, జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, డా. నిఖిల్, తులసిపాక వైద్యాధికారి ఉదయ్ రెడ్డి, హెచ్ఈఓ రాంప్రసాద్, తులసిపాక సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి చంటిపిల్లల వైద్య నిపుణులుగా డా.రాజ్‌కుమార్



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రి నందు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా డా.రాజ్‌కుమార్ విధులలో చేరారు. ఈయన కపిలేశ్వ రపురం ప్రభుత్వ ఆసుపత్రినుంచి పదొన్నతిపై పెద్దాపురంప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ (చంటిపిల్లల వైద్య నిపుణులు)గా రావడం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన డా.రాజ్‌కు మార్‌ను పలువురు వైద్యులు, ఫార్మసిస్ట్ కమలకుమారి, హెడ్ సిస్టర్ వి.రమాదేవి, పద్మజ, వైద్య సిబ్బందిరాజా,జగపతి, స్టాఫ్ నర్స్‌లు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించినవారిలో ఉన్నారు.

## పదోన్నతి బాధ్యతను పెంచుతుంది - ఎమ్మెల్యే రాజప్ప



పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ : ఉద్యోగులకు విధి నిర్వహణలో పదొన్నతులు రావడం సర్వసాధారణమని, పదొన్నతి మరింత బాధ్యత పెంచుతుందని, ఎమ్మెల్యే రాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పనిచేస్తూ విశాఖ జిల్లాకు పదొన్నతిపై వెళుతున్న డి.శ్రీలలితను సోమవారం పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో వారు సన్మానించి, అభినందించారు. ఈ సందర్భ ంగా పలువురు తెలుపుతూ శ్రీలలిత చేసిన సేవలు మండల ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ నూనె మంగాలక్ష్మీ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : మండలంలోని ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ మరియు గోపాల స్వామివారి దేవస్థానం వద్ద శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ స్వామివారి క్షేత్రపాలకులైన శ్రీ గోపాలస్వామివారి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యః వచనం పంచామృత అభిషేకం, చందనం మరియు నవనీతములతో అలంకరణ, సహస్ర నామ పూజ, అమ్మవార్లకు కుంకుమ పూజ, 27 రకాలతో నివేదన గోపూజ, అనంతరం నీరాజన మంత్రపుష్పములు, అనంతరం ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో భక్తులు, దాతలు, గ్రామస్థులు పాల్గొని తీర్థ ప్రసాదముల స్వీకరించి, శ్రీ స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామివారికి ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణ మూర్తి పట్టు వస్త్రాలు సమర్పించారు.

## రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత సమర్థవంతంగా అమలు

- ఆర్డీఓ శ్రీరమణి



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : రేషన్ పంపిణీ వ్యవస్థ పారదర్శకతతో పాటు సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్‌లోని రేషన్ డీలర్లకు ఇపోస్ యంత్రాలు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ తెలుపుతూ రేషన్ డీలర్లకు ఈ-పోస్ యంత్రాల వినియోగంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కావున డీలర్లు ప్రజలకు త్వరితగతిన అధిక నాణ్యతతో సేవలు అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు కొండబాబు, రాజు, డివిజన్‌లోని పలువురు డీలర్లు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం





**– ముఖ్యఅతిథిగా పాల్గొన్న కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**

**రామచంద్రపురం/ద్రాక్షారామం,మేజర్ న్యూస్ :** రామచంద్రపురం మండలం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణములో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర, దక్షిణా మూర్తిస్వామివారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చైర్మన్‌గా రాజా కాకర్లపూడి రాజ గోపాల నర్సరాజు బహదూర్, ధర్మకర్తలుగా తిపర్తి బేబీ, ఉప్పరాపల్లి వీరనారాయణమ్మ, కుక్కల సత్యవేణి, మాకం పద్మావతి, నిట్టల సత్య జోగారావు, కొప్పిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, బండి సత్య వీరభద్ర రావు, పోతురాజు బాల, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా కొంతేటి బాల సుబ్రహ్మణ్యం శర్మ (అర్చక) సభ్యులతో పాలక మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంనకు ముఖ్యఅతిథిగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నాటక కళ పరిషత్ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ సాంబశివరావు, ద్రాక్షారామ సొసైటీ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, దాంశెట్టి బాలరాజు,దామిశెట్టి గంగ పురుషోత్తం, మేడిశెట్టి కృష్ణదాసు, పేపకాయలపట్టాభిరామయ్య,పెంకే సాంబశివరావు, చందమామ వాసు, ఆళ్ల బుజ్జి, అల్లం రామకృష్ణ, నాయిన బ్రాహ్మణ సంఘం, విశ్వ బ్రాహ్మణ సంఘము, రామచంద్రపురం నియోజకవర్గ కూటమి సభ్యులు, ఇతర నాయకులు, శ్రీ భీమేశ్వర స్వామివారి దేవస్థానం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గ భవాని, దేవాలయ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీ రాంప్రసాద్,ఆలయం ఈవో యాళ్ల. వి.వి.సత్యనారాయణ, రామచంద్రపురం నియోజకవర్గం కూటమి నాయకులు పాల్గొని ఆలయ చైర్మన్ రాజా కాకర్లపూడి రాజగోపాల్ నరసరాజుకి, ధర్మకర్తల మండలి సభ్యులకు అభినందనలు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, సభ్యులు పాల్గొన్నారు.

# వాడపల్లి దివ్య క్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉపాలయంగా మరియు క్షేత్రపాలకుడిగా వెలిసియున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దివ్య సన్నిధానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహా పర్వదినాన్ని పురస్కరించుకొని పంచామృత అభిషేక కార్యక్రమం మరియు విశేష అర్చన నవనీయతాలంకారముతో స్వామివారికి విశేషమైన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం ద్వాదశ నివేదనలతో శ్రీకృష్ణ పరమాత్మ ఆరాధన క్రమాన్ని చేసుకుని సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి మహా పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి కార్యక్రమాలు తిలకించి పులకించారు. స్వామివారికి ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పట్టు వస్త్రాలు సమర్పించారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

**– ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా ఏజెన్సీ గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో మంజూరైన పనులు పురోగతిపై ప్రాజెక్టు అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ పీఎం జన్మన్, డి ఏ జూ గా పథకాలు ద్వారా శాఖలు వారీగా ఎన్ని పనులు మంజూరు చేసారు, పనులు పూర్తి చేసినవి, ఇంకా పూర్తి చేయవలసిన పనులుపై శాఖలు వారీగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. పీఎం జన్మన్ పథకం ద్వారా వెనుకబడిన గిరిజనులకు ఎన్ని గృహాలు మంజులైనవి, ఎన్ని గృహాలు పూర్తయినవి, ఇంకా ఎన్ని గృహాలు పూర్తి కావాల్సి ఉన్నది మండలాల వారిగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. మంజూరైన గృహాలు సకాలంలో పూర్తయ్యే విధంగా పర్యవేక్షించాలన్నారు. పంచాయతీరాజ్ పిఐయు విభాగం ద్వారా ఎన్ని రోడ్లు మంజూరు అయినవి, ఎన్ని రోడ్లు పూర్తయినవి ఇంకా ఎన్ని రోడ్లు పూర్తి చేయవలసి ఉన్నది అడిగారు. అదేవిధంగా ఎన్ని రోడ్లకు ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు కావలసి ఉన్నది మండలాల వారీగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఎన్ని భవనాలు, ఎన్ని రోడ్లు మంజూరు అయినవి, ఎన్ని పనులు పూర్తి చేసింది, ఇంకా ఎన్ని పనులు పూర్తి చేయవలసి ఉన్నది ఆయన ఆరా తీశారు. పీఎం జన్మన్ పథకం ద్వారా ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా ఎన్ని పివిటిజి కుటుంబాలకు కరెంట్ కనెక్షన్లు మంజూరైనవి, ఎన్ని కుటుంబాలకు కరెంటు కనెక్షన్లు ఏర్పాటు చేసింది, ఇంకా ఎన్ని కుటుంబాలకు కరెంట్ కనెక్షన్లు ఏర్పాటు చేయవలసి ఉన్నది ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలో త్రాగునీటికి సంబంధించిన ఎన్ని పనులు మంజూరు అయినవి, ఎన్ని పనులు పూర్తి చేసింది, ఇంకా ఎన్ని పనులు పూర్తి చేయవలసి ఉన్నది మండలాల వారీగా ఆయన ఆరా తీశారు. ఐసిడిఎస్ ఐదు ప్రాజెక్ట్ లు పరిధిలో ఎన్ని పనులు మంజూరు అయినవి, ఎన్ని పనులు పూర్తి చేసింది, ఇంకా ఎన్ని పనులు పూర్తి చేయవలసి ఉన్నది మండలాల వారీగా ఆయన ఆరా తీశారు. గిరిజన సంక్షేమ శాఖ



ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఎన్ని భవనాలు మంజూరైనవి, ఎన్ని రోడ్లు పూర్తి చేసింది, ఇంకా ఎన్ని రోడ్లు పూర్తి చేయవలసి ఉన్నది ఆయన ఆరా తీశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన శాఖ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రైమరీ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఎన్ని మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఏకలవ్య పాఠశాలలు, కస్తూరిబా పాఠశాలలు, ప్రభుత్వ హైస్కూల్లో, జడ్పీ హైస్కూల్స్, ఎంపీపీ పాఠశాలలో ఉన్నది గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు పివోకు వివరించారు. ఈ సంవత్సరం ఎన్ని మెట్రిక్ టన్నుల జీడి మామిడి పిక్కలు కొనుగోలు చేసింది, అదేవిధంగా ఏజెన్సీలో జీడిమామిడి పిక్కల ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసింది, అదేవిధంగా ఎన్ని వీడి వీకేలు ఉన్నాయి, ప్రస్తుతం ఎన్ని పనిచేస్తున్నాయి, అదేవిధంగా ఎన్ని వీడి వీకే లకు ప్రోసెసింగ్ మిషనరీలు ఏర్పాటు చేసింది, ఎంతమంది వీడి వీకే సభ్యులకు ఫ్లోర్ మిల్లులు ఏర్పాటు చేసింది వెలుగు ఏపీడి దేగలయ్య, పి హెచ్ ఓ దేవదానం వివరించారు. జీడి మామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. వివిధ శాఖల అధికారులు సంబంధిత పనులపై పూర్తి వివరాలు సిద్ధంగా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియేలు, రవికుమార్, ఏడీఏలు సావిత్రి, రామ్మోహన్ రావు దొర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, శివ, సుబ్బారావు, రమేష్, ఏడిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ డేవిడ్, జిసిసి డిఎం జయశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి కె.లక్ష్మణ్, ఉపాధి పథకం ఏపీవో బి.సత్యనారాయణ, సిడిపిఓలు కె.ఉమా, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం అమరావతిలో ప్రారంభమైన రెండు రోజుల జిల్లా కలెక్టర్లు సమావేశం

**– నాలుగవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి**



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** 15 మరియు 16 తేదీలలో రెండు రోజుల పాటు ఏపి సచివాలయంలో నిర్వహించే 4వ జిల్లా కలెక్టర్ల సమావేశం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశంలో సిఎస్.కె. విజయానంద్,డిజిపి హరీష్ కుమార్ గుప్త,పలువురు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు తదితరులు ఈసమావేశంలో పాల్గొన్నారు. జిల్లాల్లో ప్రగతి, సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సిఎం సమీక్షించి భవిష్యత్ దిశానిర్దేశం చేయనున్నారు. ఇందులో భాగంగా 8 కేటగిరీల్లో వివిధ ప్రభుత్వ శాఖలపై సమీక్షించనున్నారు. జీఎస్డీపీ, సంక్షేమం, పీ–4, సూపర్ సిక్స్ అమలు వంటి అంశాలపై సమీక్ష, లాజిస్టిక్స్, ఇన్ఫ్రా, స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీపై కలెక్టర్ల కాన్ఫరెన్సులో తొలి రోజు చర్చ.ఆయా అంశాలపై చర్చలో భాగంగా కాకినాడ జిల్లా సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన, తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికలు, కార్యక్రమాలపై సమగ్రంగా రూపొందించుకున్న నివేదికల కార్యాచరణపై రాష్ట్ర ముఖ్యమంత్రికి కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి వివరించనున్నారు.

## జెఎన్టీయుకెలో ఘనంగా 165వ ఇంజినీర్ల దినోత్సవం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కాకినాడ లోకల్ చాప్టర్ మరియు రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో165వ ఇంజినీర్ల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ సెమినార్ హాల్లో జరిగాయి.ఈ కార్యక్రమానికి జెఎన్‌టియుకె వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి సభను ఉద్దేశించి ప్రసంగించారు. తన ప్రసంగంలో ఆయన, "భారత దేశ అభివృద్ధిలో ఇంజినీర్లకు ఉన్న పాత్ర అపారమైనది. నేటి తరం ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త మార్గాలను అన్వేషించి, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను తీసుకురావాలి. 2025లో తీసుకున్న థీమ్ "డీప్ టెక్నాలజీ & ఇంజినీరింగ్ ఎక్సలెన్స్" లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌కి అనుకూలమైన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి" అని అన్నారు.అతిథి విశిష్టులుగా హాజరైన సిహెచ్. పురుషోత్తం గంగరాజు, నీటివనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (రిటైర్డ్), "ఇంజినీర్ల కృషి సమాజ నిర్మాణానికి పునాది. ముఖ్యంగా నీటివనరుల అభివృద్ధి, రవాణా వ్యవస్థలు, పరిశ్రమల వృద్ధిలో ఇంజినీర్ల ప్రాధాన్యం ఎంతో గొప్పది. ఇలాంటి స్ఫూర్తి దాయక దినాలు విద్యార్థులలో సేవా భావాన్ని పెంచుతాయి" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి డా. వి.జయ ప్రసాద్, చైర్మన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కాకినాడ, ఎన్.కృష్ణరావు, ప్రెసిడెంట్, రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజినీర్స్ కాకినాడ అధ్యక్షత వహించారు. వారు ఇంజినీర్ల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి, ఈరోజు ప్రతి ఇంజనీర్‌కు ఒక స్ఫూర్తిదాయక దినంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, రిటైర్డ్ సివిల్ ఇంజినీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు